సాక్షి ప్రకాశం

ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



రాష్ట్రంలో జవాబుదారి పాలన
సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజలకు జవాబుదారి పాలన అందిస్తున్నారని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. - 8లో..



వివాదాల పరిష్కారానికి చక్కటి వేదిక
వివాదాల పరిష్కారానికి లోక్అదాలత్ చక్కటి వేదిక అని జిల్లా ఇన్చార్జ్ ప్రధాన న్యాయమూర్తి శివకుమార్ అన్నారు. - 8లో..

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32/20
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. రాత్రి చలితీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా విద్యాశాఖ అధికారిగా పిల్లి రమేష్

ఒంగోలు: జిల్లా విద్యాశాఖ అధికారిగా పిల్లి రమేష్‌ను నియమిస్తూ ప్రభుత్వ విద్య విభాగం ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.



జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్

ప్రస్తుతం జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న బి.విజయభాస్కర్ ఇటీవల జాయింట్ డైరెక్టర్ హోదా పొందారు. దీంతో ఆయనను బదిలీ చేస్తూ ఆయన స్థానంలో రమేష్‌ను నియమించారు. రమేష్ స్వస్థలం బాపట్ల కాగా ఆయన ఇటీవలి కాలం వరకు పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. గత నవంబరులో ఆయనను నెల్లూరు నుంచి ప్రభుత్వం బదిలీ చేసింది. దీంతో ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు తాజాగా ప్రకాశం జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత డీఈవో విజయభాస్కర్‌ను ప్రభుత్వం వద్ద రిపోర్టు చేయాలని ఆదేశించారు.

నేటి నుంచి ఉభయ రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు

తర్లుపాడు: రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తర్లుపాడు మండలం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర స్థాయి బండ పందేలను ఆదివారం ఉదయం తర్లుపాడులో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ప్రారంభించనున్నట్లు ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి విలేకర్లకు తెలిపారు. న్యూ కేటగిరీ విభాగంలో ప్రథమ బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలతో పాటు ఇంకా నాలుగు, ఐదు బహుమతులు కూడా ఇస్తామని తెలిపారు. కన్సొలేషన్ బహుమతులు కూడా ఇవ్వనున్నట్లు చెప్పారు. వివరాల కోసం వెన్నా చిన్నసత్యనారాయణరెడ్డి సెల్ నంబర్ 9440791698, యేర్వ మల్లారెడ్డి 9640408773 నంబర్లకు సంప్రదించాలన్నారు.

'సీ ఫర్ క్యాస్ట్' పుస్తక సమీక్ష సభ రేపు

ఒంగోలు టౌన్: ఎన్టీఆర్ కళాక్షేత్రంలో సోమవారం సాయంత్రం నిర్వహించనున్న ప్రముఖ సంపాదకుడు, సామాజిక విశ్లేషకుడు సతీష్ చందర్ రచించిన 'సీ ఫర్ క్యాస్ట్' పుస్తక సమీక్ష సభను జయప్రదం చేయాలని బ్లూవింగ్స్ ఫౌండేషన్ చీఫ్ అడ్వైజర్ డాక్టర్ శివరామ కృష్ణ కోరారు. ఒంగోలు ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని అన్నీ రంగాల్లో కులం కోరలు ఎలా విస్తరించాయో, కేవలం కొంత మంది ప్రయోజనాల కోసం మాత్రమే అది ఎలా పనిచేస్తుందో సతీష్ చందర్ ఈ పుస్తకంలో సవివరంగా చర్చించారని తెలిపారు. బ్లూవింగ్స్ మీడియా, కల్చరల్ విభాగం సలహాదారు మొగలి దేవ సంస్థ లక్ష్యాలు, ఆశయాలు, ముఖ్య ఉద్దేశాలను వివరించారు. సమావేశంలో అసెక్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్. సుధీర్‌బాబు, సంస్థ నెల్లూరు జిల్లా కో ఆర్డినేటర్ కూరపాటి విజయరాజు పాల్గొన్నారు.

శ్రీశైలంలో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

మార్కాపురం: శ్రీశైలం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ట్రస్ట్ బోర్డు సభ్యురాలు డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ శనివారం తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఉండేందుకు శ్రీశైలంలోని వివిధ ప్రదేశాల్లో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈఓ లవన్నతో కలసి ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. పాదయాత్రగా వచ్చే భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. స్వామిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశామని, లక్షకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉందని అందుకు తగిన ఏర్పాట్లు చేశారన్నారు. శివరాత్రి పర్వదినాన ఆంక్షలు లేకుండా ఘాట్‌రోడ్డులో వాహనాలు వెళ్లేందుకు అటవీశాఖ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు.



"నడత హుందాగా ఉండాలి..నడకలో హొయలొలకాలి..రంగు మెరిపించాలి.. పొంగు భళా అనిపించాలి.." ఇవి గ్లామర్ కాంటెస్ట్‌లో పోటీపడే బ్యూటీలకు కావాల్సిన అర్హతలని చదువుతుంటేనే అర్థమైపోతుంది. అయితే ఆ అందం గంప కింద నుంచి రావాలి అనే కొత్త రూల్ చదివితే మాత్రం మైండ్ బ్లాంకైపోతుంది. అవును.. ఆ గంప కింద ఉన్న కోడి ఇప్పుడు అందాల ర్యాంప్‌పైన కూస్తోంది. తోటి కోళ్లతో పోటీపడి మరీ వయ్యారాలొలకబోస్తోంది. అందాల కోడి కిరీటం కోసం 'సై' అంటోంది. కోడేమిటి? అందాల పోటీలేమిటి? సమాధానమే ఈ కథనం..ఎన్నో ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుందామా మరి..



కొక్కొరొకో.. ఎంత సొగసో...

ఒంగోలు డెస్క్

అందాల పోటీలకు సై అంటున్న కోడిపుంజులు

- పోటీల కోసం రెండేళ్లపాటు ప్రత్యేకంగా పెంపకం
- బలమైన ఆహారంతో బాడీబిల్డర్‌లాంటి దేహ దారుఢ్యం
- తమిళనాడు, కేరళకే పరిమితమైన పోటీలు మన రాష్ట్రంలోనూ..



కొమరోలు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన సయ్యద్ బాష ..పక్షి ప్రేమికుడు. ఇతని వద్ద రకరకాల పక్షులతోపాటు వివిధ రకాల కోడి పుంజులు, పెట్టలు ఉన్నాయి. ప్రత్యేకంగా కనిపిస్తున్న పుంజుల గురించి అడగగా.. ఇవి అందాల పోటీల కోళ్లని చెప్పడంతో ఆశ్చర్యపోయాం.. వాటి గురించి తెలుసుకోవాలన్న కుతూహలం పెరిగింది. అందాల పోటీలా? ఎక్కడ జరుగుతున్నాయి..? ఏంటి ప్రత్యేకతలు అని ప్రశ్నించాం.. మనకు సంప్రదాయబద్ధంగా సంక్రాంతికి గోదారోళ్లు నిర్వహించే కోడి పందేల్లా..తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో దాదాపు 50 సంవత్సరాలుగా అందాల పోటీలు నిర్వహిస్తున్నారని చెప్పాడు. జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఈ పోటీలకు హాజరవుతున్నాం. ఈ సారి రాష్ట్రంలోని పెంపకందారులం అందరం కలసి అసోసియేషన్‌గా ఏర్పడ్డాం. అనంతపురం జిల్లాలో తొలిసారిగా సంక్రాంతికి కోడి అందాల పోటీలు నిర్వహించారని చెప్పాడు. తమిళనాడు, కేరళ, కర్నాటక, చత్తీస్‌ఘడ్, ఒడిసా, పాండిచ్చేరి తదితర రాష్ట్రాల వారు కూడా ఈ పోటీల్లో పాల్గొన్నారు. వయ్యారాలొలకబోసే కోడి పుంజుల ప్రత్యేకతలు తెలుసుకుందాం..

ఆహార్యం..అద్భుతం

ఈ పోటీల్లో పాల్గొనే పుంజులు ప్రత్యేక ఆహార్యాన్ని కలిగి ఉండాలి. తల నుంచి బాడీ, తోక, కాళ్ల వరకూ అన్నీ విభిన్నంగా ఉండాల్సిందే. మెడ నిటారుగా 90 డిగ్రీలో బాడీ ఉండాలి. తెల్ల కళ్లు బెస్ట్ క్వాలిటీ.. తలపై భాగం జుట్టు ఎర్రగా ఉండి గుండ్రంగా గులాబి రేకుల్లా ముద్దగా పువ్వు అతికించినట్టుగా ఉండాలి. బాడీ దృఢంగా ఉండి కాళ్లు..కాళ్ల మధ్య ఎడం ఉండాలి. బాడీ బిల్డర్ ఎలా నడుస్తాడో అలా నడకలో స్టైల్ ఉండాలి. కాళ్ల వేళ్లు పొడవుగా చక్కగా ఉండాలి. తోక అందంగా ఉండి ఈకలు దుబ్బుగా ఉండాలి. తెలుపు, రెడ్, బ్లాక్ కిరీ ఇలా కోడి మొత్తం ఫ్యాన్సీ కలర్‌లో ఉంటే అందరూ ఇష్టపడతారు.



పౌష్టికాహారం...

ఈ పోటీలకు సిద్ధం చేసే పుంజులకు ఆహారం ప్రత్యేకంగా ఉంటుంది. జొన్నలు, రాగులు, గోధుమలు, సజ్జలు, మొక్కజొన్న, పెసలు, గుడ్లు, ఖర్జూరం, పిస్తా, బాదం, జీడిపప్పు, పండ్లు తినిపిస్తారు. రోజూ మూడు విడతలుగా ఆహారం ఇస్తారు. అరటి, ద్రాక్ష, దానిమ్మ, సమ్మర్‌లో వేడి తగ్గించేందుకు పుచ్చకాయ పెడతారు. ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది వరకూ కొలత ప్రకారం జొన్నలు, రాగులు, సజ్జ, మొక్కజొన్న, పెసలు, గోధుమలు ఇస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు కోడి గుడ్లు, నానబెట్టిన డ్రై ఫ్రూట్స్ తినిపిస్తారు. ఆహారం సులభంగా జీర్ణం అయ్యేందుకు అరటి, దానిమ్మ, ద్రాక్ష పండ్లు ఇస్తారు. ఇలా క్రమం తప్పకుండా ఆహారం ఇవ్వడంతో శరీరం బలిష్ఠంగా ఉంటుంది. అందాల పోటీలకు ఒక కోడిని తయారు చేసేందుకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చవుతుంది. చిన్నప్పటి నుంచి మంచి ఆహారాన్ని ఇస్తే ఎదుగుదల బాగుంటుంది.

ఎంపిక ఇలా..

అందాల పోటీల ఎంపిక ఇలా ఉంటుంది. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన కోళ్లను ముందుగా నిర్వాహకులు పరిశీలిస్తారు. అర్హమైన వాటిని గుర్తిస్తారు. వాటికి నంబర్‌తో కూడిన ట్యాగ్‌లు ఇస్తారు. ఐదుగురు న్యాయనిర్ణేతలు ఉంటారు. అందులో ప్రభుత్వాధికారులు (పశుసంవర్ధకశాఖకు చెందిన) కూడా ఉంటారు. మధ్యలో ఒక టేబుల్ ఏర్పాటు చేస్తారు. నంబర్ ప్రకారం పిలుస్తారు. టేబుల్‌పై ఉంచిన పుంజును జడ్జిలు పరిశీలించి మార్కులు ఇస్తారు. ఒకరు ముక్కు నుంచి మెడ వరకూ ఎంత దూరం ఉంది అని పరిశీలిస్తారు. మరొకరు బాడీ స్టైల్, రంగు, కాళ్లు, కళ్లు ఇలా అన్నీ పరిశీలిస్తారు. ఈ ఐదుగురు ఇచ్చిన మార్కులను కలుపుతారు. అందులో ఎక్కువ మార్కులు వచ్చిన పుంజును విజేతగా ప్రకటిస్తారు.



పోటీకి సిద్ధమైన తెల్ల పుంజు





క్రాస్ బ్రీడింగ్..

తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఉండే బ్రీడర్ దగ్గర నుంచి బ్రీడ్ తెచ్చుకుంటారు. ఇక్కడ పెట్టలతో క్రాస్ బ్రీడ్ చేస్తారు. అలా వచ్చిన పుంజులను రెండేళ్లపాటు పెంచుతారు. వీటి గుడ్డు కూడా చాలా విలువైంది. నాణ్యతను బట్టి రేటు ఉంటుంది. మన జిల్లాలో రూ.1000 ఉంటుంది. తమిళనాడులో అయితే రూ.5 వేల వరకూ ఉంటుంది. చిన్న చిన్న పిల్లలను ఆసక్తి ఉన్నవారికి విక్రయిస్తుంటారు.



ప్రత్యేక శిక్షణ:

పుంజులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. పోటీలకు మూడు నెలల నుంచి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ శిక్షణ ఇస్తారు. బెదురు పోయేందుకు బాడీని నిమురుతారు. అలాగే నీళ్లతో తడుపుతారు. ఇసుకలో పొర్లిస్తారు. ఇలా చేయడం ద్వారా ఈక ఒత్తుగా ఉంటుంది. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ రెండేళ్లు పెంచుతారు. పోటీలకు సిద్ధమయ్యే పుంజులు ఏడు నుంచి ఎనిమిది కేజీల బరువు ఉండేలా చూసుకుంటారు. డబుల్ బాడీ వచ్చేలా ఫీడింగ్ ఇస్తారు. గంభీరంగా బాడీబిల్డర్‌లా ఉంటుంది. కాళ్లు దృఢంగా, పాదాలు పెద్ద పెద్దగా ఉండేలా చూసుకుంటారు. వీటిని ఎక్కువగా అనంతపురం, కర్నూలు, కడప, ప్రకాశం, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో పెంచుతారు.



ఆసక్తితోపాటు ఆదాయం..

చిన్నప్పటి నుంచి పక్షులను పెంచడం హాబీగా ఉండేది. తమిళనాడులో అందాల పోటీలు నిర్వహిస్తున్నారని మిత్రుడు చెప్పాడు. ఒకసారి వెళ్లి చూసి వచ్చిన తర్వాత కోడి పుంజులను పెంచాలన్న ఆసక్తి నెలకొంది. మంచి బ్రీడ్‌లను తీసుకొచ్చాను. అలా పుంజులను పోటీలకు సిద్ధం చేస్తున్నా. అనంతపురంలో తొలిసారిగా నిర్వహించిన పోటీలకు పుంజును తీసుకువెళ్లా. ఈ పోటీల్లో నాలుగో స్థానం వచ్చింది. వీటిని పెంచి ఆసక్తి ఉన్నవారికి విక్రయించడం ద్వారా ఉపాధి కూడా ఉంటోంది.

– సయ్యద్ బాష, రాజుపాలెం, కొమరోలు మండలం

అధికారం కోసం రాష్ట్రంపై విరుచుకుపడిన తోడేళ్లు

- సింహంలా.. సింగిల్‌గా వస్తున్న జగనన్న
- ఉనికిని కాపాడుకోవటానికే లోకేష్ పాదయాత్ర
- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: అధికారం కోసం రాష్ట్రంపై కొన్ని తోడేళ్లు విరుచుకొని పడుతున్నాయని, జగనన్న సింహంలా సింగిల్‌గానే వచ్చి మళ్లీ అధికారం చేజిక్కించుకుంటారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో శనివారం ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి మండల పార్టీ కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి జవాబుదారితనంతో పాలన కొనసాగిస్తున్నారని, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలకు అండగా నిలిచారని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతి పక్షాలు తప్పుడు ప్రచారాలు చేసుకుంటూ తిరుగుతున్నారని విమర్శించారు. జవాబుదారితనంతో జగనన్న పాదయాత్ర చేసి ఎన్నికల ముందు చేసిన వాగ్దానాల్లో 98 శాతం నెరవేర్చారని చెప్పారు. ప్రజల ఓటింగ్‌తో కనీసం గ్రామ సర్పంచ్ హోదా కూడా లేని నారా లోకేష్ పాదయాత్ర చేయడం, ప్రజల సమస్యలను తాను పరిష్కరిస్తానని చెప్పుకుంటూ తిరగడం హాస్యాస్పదంగా ఉందని, ఆయనకు కేవలం మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తనయుడిగా మాత్రమే హోదా ఉందని ఎద్దేవా చేశారు. తమ కుటుంబం, పార్టీ ఉనికిని కాపాడుకోవటానికే లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరు మాత్రం కోరుకుంటారు, బీసీల తోకలు కత్తిరిస్తానని ప్రగల్భాలు పలికారని అన్నారు. రుణమాఫీ చేస్తానంటూ ఎగ్గొట్టి డ్వాక్రా మహిళలను దగా చేశారని, పసుపు కుంకుమ పేరుతో మరోసారి మహిళల ఓట్లను కొనాలని ప్రయత్నించారని, బాబు చేసిన తప్పిదాల వలన కొత్తగా ఏర్పడిన ఏపీ అప్పుల్లో కూరుకుపోయిందని చెప్పారు. టీడీపీ పాలనలో 6 వేల పాఠశాలలు మూతపడ్డాయని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగార్చారని, వైద్యం పట్ల బాబు నిర్లక్ష్యం వహించారని విరుచుకుపడ్డారు. 'మా నమ్మకం, నువ్వే జగన్' కార్యక్రమంపై కన్వీనర్లు, గృహ సారథులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కార్యక్రమానికి సంబంధించిన ప్రచార కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్‌బ్యాంకు డైరెక్టర్ మూడమంచు బాల గురవయ్య, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, మండల కో ఆప్షన్ సభ్యుడు కె.విజయకుమార్, వైస్ ఎంపీపీ మందుల ఆదిశేషు, ఆర్యవైశ్య సంఘం నాయకులు సూరె రమేష్, కందూరి కాశీనాథ్, జిల్లా ఎస్సీ సంఘం నాయకుడు బి.బాలచెన్నయ్య పాల్గొన్నారు.

వెలిగొండ పూర్తిచేసేది సీఎం జగనే..

- శిలాఫలకం వేసి వదిలేసిన ఘనత చంద్రబాబుది
- నిధులిచ్చి పనులు వేగవంతం చేసిన వైఎస్సార్
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి



మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: వైఎస్ రాజశేఖరరెడ్డి మొదలు పెట్టిన వెలిగొండ ప్రాజెక్టును ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిచేసి ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్చి 3, 1996లో వెలిగొండ ప్రాజెక్టుకు శిలాఫలకం వేసిన చంద్రబాబుతో మాట్లాడినప్పుడు నిధులు అడిగితే నీళ్లులేవు, నిధులు లేవు అని చెప్పిన ఆయన.. మళ్లీ అధికారంలోకి వస్తే పూర్తి చేస్తానని చెప్పటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. 1996లో వెలిగొండ ప్రాజెక్టుకు శిలాఫలకం వేసి మూడు జిల్లాల ప్రజల సమక్షంలో ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పి మాట నిలబెట్టుకోలేకపోయిన ఘనత మాజీ సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. 13 ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగి ఉన్న చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే నేనే ప్రాజెక్టును ప్రారంభిస్తానని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2004లో ఎలక్షన్ జరిగి 2005లో సీఎంగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాజెక్టు యాత్రలో భాగంగా నేను మార్కాపురం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వెలిగొండను సందర్శించి వెంటనే రూ.3500 కోట్ల నిధులను మంజూరు చేసిన ఘనత దివంగత నేత వైఎస్ఆర్‌కు దక్కిందన్నారు. ఆ సమయంలో నేను వైఎస్ఆర్‌తో అన్నాను "ఆ నాడు మేము మొక్కలు వేశాము, ఇపుడు మీరు జీవం పోస్తారా" అని అంటే "మీరే చూస్తారుగా జీవం పోసేది" అని చెప్పి నిధులు మంజూరు చేసిన మహానుభావుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని తెలిపారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఏం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరుతో మొదటి టన్నెల్ పూర్తి చేసింది మీకు కనిపించలేదా అని ప్రశ్నించారు. రెండో టన్నెల్ కూడా త్వరలో పూర్తి చేసి వరదలు వచ్చే సమయానికి నీళ్లు వదులుతారని తెలిపారు. సమావేశంలో ఈయన వెంట వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

జిల్లాలోని విద్యార్థులకు రేపు ప్రాంగణ ఎంపికలు

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం హైదరాబాదుకు చెందిన ప్రముఖ సంస్థ 247 ఏఐ ప్రాంగణ ఎంపికలు నిర్వహించనుందని కాలేజీ కార్యదర్శి మద్దిశెట్టి శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని కాలేజీలకు చెందిన 2022–23 బ్యాచ్ డిగ్రీ, బీటెక్ అన్ని బ్రాంచీలు, ఎంబీఏ విద్యార్థులు హాజరుకావచ్చన్నారు. పాల్గొనదలచిన విద్యార్థులు వారి రెజ్యూమ్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక పేస్ కాలేజీకి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9581456303ను సంప్రదించాలని సూచించారు.

ట్రాక్టర్ ఢీకొని మాజీ ఎంపీటీసీ మృతి


మృతుడు కొండయ్య (ఫైల్)

కొండపి: ఎదురుగా వచ్చిన కట్టెల లోడు ట్రాక్టర్ బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని పెదకండ్లగుంట గ్రామానికి కిలో మీటరు దూరంలో శుక్రవారం జరగ్గా, క్షతగాత్రుడు శనివారం మృతిచెందడంతో వెలుగులోకి వచ్చింది. ఏఎస్సై అంకారావు తెలిపిన సమాచారం మేరకు పెదకండ్లగుంట గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాచర్ల వెంకట కొండయ్య (56) శుక్రవారం కొండపి వెళ్లి వ్యక్తిగత పనులు చూసుకుని తన ద్విచక్రవాహనంపై మరో వ్యక్తిని ఎక్కించుకుని రాత్రి 9 గంటల సమయంలో తిరిగి ఇంటికి బయలుదేరాడు. అదే సమయంలో పెదకండ్లగుంట గ్రామానికి చెందిన కట్టెల ట్రాక్టర్ కాటా వేయించుకోవడానికి కొండపి వైపు వెళ్తోంది. ఎదురుగా వస్తున్న కొండయ్య ద్విచక్రవాహనానికి కట్టెల ట్రాక్టర్ తగలడంతో ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న కొండయ్య తలకు బలమైన గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో కొండయ్యతో పాటు వెనుక కూర్చుని గాయపడిన వ్యక్తిని కూడా కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం కొండయ్య మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై అంకారావు తెలిపారు. ద్విచక్రవాహనం వెనుక కూర్చుని గాయపడిన వెంకటేశ్వర్లు చికిత్స పొందుతున్నాడు.

గోమాతకు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు


గోవును ఊరేగింపుగా అంత్యక్రియలకు తరలిస్తున్న గ్రామస్తులు


మృతిచెందిన గోవు

చీమకుర్తి: అకస్మాత్తుగా చనిపోయిన గోవుకు సంతనూతలపాడు మండలం బీ మాచవరం గ్రామస్తులు శనివారం శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. పది రోజుల క్రితం ఎక్కడి నుంచో ఒక గోవు మాచవరం గ్రామానికి వచ్చింది. ఇళ్ల వెంట తిరుగుతుండగా.. స్థానికులు పూజలు చేస్తూ ఆహారం అందిస్తూ వచ్చారు. ఇంతలో ఏమైందో ఏమో శనివారం గోవు ఆకస్మికంగా మృతి చెందింది. తినకూడని ఆహార పదార్థాలేమైనా తినడం వలన మృతి చెంది ఉంటుందని గ్రామస్తులు భావిస్తున్నారు. గ్రామస్తుడు వీరబోయిన గిరిబాబు ఆధ్వర్యంలో స్థానికులు శింగయ్య, వెంకటేశ్వర్లు, వెంకటేష్ తదితరులు కలిసి మృతిచెందిన గోవుకు పూజలు చేసి వేదపండితుల సమక్షంలో ఊరేగింపుగా శ్మశానానికి తీసుకెళ్లి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రంలో జవాబుదారి పాలన

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులతో మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు జవాబుదారి పాలన అందిస్తున్నారని, దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలను ఆదుకుంటున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. యర్రగొండపాలెంలోని సచివాలయం–2లో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నవరత్నాల పథకాన్ని అమలు చేస్తున్నారని, గతంలో ఎన్నడూ లేని విధంగా పథకాల అమలు గురించి క్యాలెండర్ విడుదల చేసి కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. పేద పిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిష్టించాలన్న ఉద్దేశంతో జగనన్న ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది, ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని, విదేశాలకు వెళ్లి చదవులు అభ్యసించే విద్యార్థులకు రూ.1 కోటి వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నారని అన్నారు. ధనవంతుల పిల్లలే విద్యను అభ్యసించాలని, కార్పొరేట్ స్కూళ్లకు వంతపాడుతూ పచ్చనేతలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం చదువులను అడ్డుకోవటానికి ప్రయత్నించారని విమర్శించారు. మూడున్నర సంవత్సరాల కాలంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.7 లక్షలకుపైబడి లబ్ధి పొందిన పేదలు ఉన్నారని, ఇంకా ప్రజలకు ఏమైనా అవసరాలు ఉంటాయన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపెట్టి తమ వద్దకు పంపిస్తున్నారని అన్నారు. ప్రజలు తమకు కావలసిన అవసరాలను చెప్పుకుంటుంటే నిలదీస్తున్నారని ఎల్లో మీడియా పనికట్టుకొని ప్రచారం చేస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన చంద్రబాబునాయుడికి ఏదో ఒక విధంగా అధికారం కట్టబెట్టాలన్న ఆలోచనతో ఆ మీడియా తమ శాయశక్తులా ప్రయత్నిస్తోందని, ఈ ప్రయత్నాలు రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందివ్వాలని వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెడితే వారిని పార్టీ వ్యవహారాలకు ఉపయోగించుకుంటున్నారని పచ్చనేతలు దుర్మార్గపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఇంకా మెరుగైన సేవలు అందించేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజల గడపల వద్దకు వస్తున్నారని, వారికి తమ సమస్యలు ఏమైనా ఉంటే చెప్పి నిర్దేశించిన సమయంలో పరిష్కరించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత తమ అందరిపై ఉందని అన్నారు. సచివాలయం–2 పరిధిలోని చైతన్య నగర్‌లో తాగు నీటి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి నీటి వసతి కల్పించేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ జబీవుల్లా, మండల కో ఆప్షన్ సభ్యుడు విజయకుమార్, పార్టీ మండల కన్వీనర్ కె.ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, డి.సుబ్బారెడ్డి, ఏకుల మునలారెడ్డి, సోషల్ మీడియా మండల కో కన్వీనర్ షేక్.కాశింబాషా పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో లారీ క్లీనర్ మృతి

- మరో ఇద్దరికి స్వల్ప గాయాలు


మృతిచెందిన క్లీనర్ మత్తయ్య

చీమకుర్తి: విద్యుత్ షాక్ తగిలి లారీ క్లీనర్ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సంతనూతలపాడు మండలం వేములపాడు సచివాలయం పరిధిలోని గొర్లమిట్ట గ్రామంలో శనివారం జరిగింది. అర్ధవీడు మండలం మొహిద్దీన్‌పురం నుంచి కట్టెల లోడు తీసుకుని గొర్లమిట్టలోని మద్దినేని సుబ్బారావు అనే రైతు ఇంటి వద్ద కట్టెలు దించి తిరిగి వెళ్లే సమయంలో రోడ్డుకు అడ్డంగా పైన వేలాడుతున్న కరెంటు తీగలు లారీకి తగిలాయి. లారీపైన ఉన్న నేమ్‌ప్లేట్‌కు తగలడంతో లారీ మొత్తం కరెంటు షాక్‌కు గురైంది. లారీని పట్టుకుని దిగే సమయంలో క్లీనర్ తట్టూరి మత్తయ్య (49) అక్కడికక్కడే మృతిచెందగా, డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకున్నాడు. మృతిచెందిన మత్తయ్యను పక్కకు లాగేందుకు స్థానిక రైతు వద్దకు పచ్చాకు పనుల కోసం వచ్చిన హనుమంతరావు, ఆంజనేయులు ప్రయత్నం చేయగా, వారికి కూడా కరెంటు షాక్ తగిలి స్వల్ప గాయాలయ్యాయి. ప్రాణానికి ఎలాంటి ప్రమాదం లేదని పోలీసులు తెలిపారు. కరెంటు షాక్ తగిలిన లారీకి టైర్‌లు, బ్యాటరీ, ఇతర భాగాలు కాలి స్వల్పంగా నష్టం వాటిల్లింది. ఎస్సై బీ శ్రీకాంత్ కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు.

సేవకు సెల్యూట్..!

- ఆదర్శవంతంగా ఇద్దరు మాజీ సైనికులు
- మాజీ సైనికుల సంఘ భవన నిర్మాణానికి ఆర్థికసాయం
- ఏకంగా కూలీలుగా మారి భవన నిర్మాణంలో పాలుపంచుకుంటున్న వైనం


మాజీ సైనికుల సంఘ భవన నిర్మాణ పనులు చేస్తున్న మాజీ సైనికులు గురుప్రసాద్, సుబ్బారాయుడు

గిద్దలూరు రూరల్: వారిద్దరూ దేశం కోసం సైన్యంలో పనిచేశారు. సైనికులుగా కొన్ని సంవత్సరాల పాటు దేశానికి సేవ చేశారు. రిటైర్మెంట్ తర్వాత కూడా తోటి సైనికుల కోసం తమ వంతు సేవ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గిద్దలూరుకు చెందిన మాజీ సైనికులు గురుప్రసాద్‌యాదవ్, సుబ్బారాయుడు మాజీ సైనికుల సంఘ భవన నిర్మాణానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. పూర్తి స్థాయిలో వారి సేవలను వినియోగిస్తున్నారు. మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించుకునేందుకు గిద్దలూరులోని నంద్యాల హైవేలో సగిలేరు వాగు సమీపంలో మాజీ సైనికుల సంఘ భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించింది. ఆ స్థలంలో భవన నిర్మాణం చేపట్టారు. గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో త్రివిధ దళాల్లో మొత్తం 15 వేల మందికిపైగా పనిచేస్తున్నారు. ఇప్పటికే పనిచేసి రిటైర్మెంట్ పొందిన మాజీ సైనికులు 10 వేల మందికిపైగా ఉన్నారు. వీరి సమస్యల పరిష్కారానికి భవనం నిర్మిస్తుండగా, ప్రస్తుతం భవనంపై సైనికుల అతిథి గదుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మాజీ సైనికుల వద్ద నుంచి సేకరించిన నగదుతో నిర్మాణాలు చేపట్టారు. మాజీ సైనికులైన గురుప్రసాద్‌యాదవ్, సుబ్బారాయుడు తమ వంతు ఆర్థిక సాయం చేయడంతో పాటు భవన నిర్మాణానికి కూలీల కొరత ఉండటంతో వారే కూలీలుగా మారారు. తాపీ మేస్త్రీల కింద కూలీలుగా పనిచేస్తున్నారు. సైనికులుగా రిటైర్మెంట్ పొందినప్పటికీ.. సేవకులుగా రిటైర్మెంట్ లేదంటూ పది మందికి ఉపయోగపడే పనిలో తమ వంతు పాత్ర పోషిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

వివాదాల పరిష్కారానికి చక్కటి వేదిక.. లోక్ అదాలత్

- జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి శివకుమార్



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి శివకుమార్

ఒంగోలు: వివాదాల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కని వేదికని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఆర్.శివకుమార్ అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీపడేందుకు అర్హత ఉన్న అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులను ఇరుపక్షాల కక్షిదారులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. పరిష్కారం కోసం న్యాయమూర్తులు కూడా సహకరిస్తారన్నారు. స్థలాలు, పొలాల యజమానులు రెవెన్యూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భూముల వర్గీకరణ గురించి తెలుసుకోవాలన్నారు. సివిల్ తగాదాలలో విస్తృతమైన అంశాలు ఇమిడి ఉంటాయన్నారు. వాటి మీద ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో దాదాపు 11 వేలకుపైగా కేసులు పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు మాట్లాడుతూ రెవెన్యూ, పోలీసు అధికారులు, న్యాయవాదుల సహకారంతో కేసుల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు బి.సత్యకుమారి, ఎస్.విజయలక్ష్మి, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ నరసింహరాజు, ఒంగోలు పట్టణ డీఎస్పీ యు.నాగరాజు, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా జరిగిన లోక్ అదాలత్‌లో దాదాపు 16 వేల కేసులు పరిష్కారమయ్యాయి.

బ్లాక్ మనీ పేరుతో దందా

ఒంగోలు: బ్లాక్ మనీ పేరుతో పెద్ద ఎత్తున దందాకు తెరలేపారు. ఏకంగా జిల్లాల వారీగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని దీనిని నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా అనంతపురం జిల్లా పోలీసులు బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారంలో బాధితుడైన ఒంగోలు వాసి పోలీసులను ఆశ్రయించాడు. అద్దంకికి చెందిన వ్యక్తి ఒంగోలులో ఒక వ్యాపారిని కలిశాడు. మనదేశానికి చెందిన కరెన్సీ పెద్ద ఎత్తున బంగ్లాదేశ్‌లో నిల్వ ఉందని, బ్లాక్ మనీ రూపంలో ఉన్న సంబంధిత మొత్తాన్ని మన దేశంలో చెలామణి చేయడానికి వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకున్న పలువురు తనకు తెలుసంటూ నమ్మించాడు. ఖమ్మం జిల్లాకు చెందిన మదార్, ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన వ్యక్తిని, నెల్లూరు జిల్లాకు చెందిన మున్నా అలియాస్ కార్తీక్‌రెడ్డి అనే వ్యక్తిని ఒంగోలు రప్పించి పరిచయం చేశాడు. తమకు పాతనోట్లు ఎంత మొత్తం ఇస్తే అంతకు ఐదు రెట్లు బ్లాక్ మనీ పంపిస్తామన్నారు. ఇందుకు ఒంగోలుకు చెందిన వ్యాపారి తనతోటి వ్యాపారిని కూడా కలుపుకుని ఇద్దరూ కలిసి వారికి పెద్ద కరెన్సీ నోట్ల గుట్టను చూపించారు. అందులో పరిశీలిస్తే అవన్నీ ఒరిజినల్ కరెన్సీనే. అయితే, నోట్లన్నీ ఒకేసారి మార్కెట్‌లోకి తీసుకెళ్తే ఇబ్బంది అని, కొద్దికొద్దిగా మార్కెట్‌లోకి పంపాలని, ఇందుకు తాము వ్యాపారులతో ఒప్పందం చేసుకోవడం ద్వారా మీ సహకారం కోరుతున్నామని అన్నారు. అందుకు అనంతపురం జిల్లాకు చెందిన నాగమ్మ తమ బాస్ అని చెప్పినట్లు సమాచారం. మొత్తంగా మదార్ రూ.3 లక్షలు, ఏలూరుకు చెందిన వ్యక్తి రూ.5 లక్షలు, నెల్లూరుకు చెందిన మున్నా రూ.11.50 లక్షలతో ఒప్పందం చేసుకున్నారు. తీరా అందరూ కలిసి ఇస్తామన్న కరెన్సీ ఇవ్వకుండా మోసం చేసినట్లు తదుపరి వెలుగులోకి వచ్చింది. వారిని ఎన్నాళ్లు అడుగుతున్నా సమాధానం రాకపోవడంతో తాను దారుణంగా మోసపోయానని భావించిన సదరు వ్యక్తి స్థానిక ఓ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేయగా, లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

కారు ఢీకొని ఒకరు మృతి


సంఘటనా స్థలంలో అంజయ్య

నాగులుప్పలపాడు: కారు ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం ఉదయం ఉప్పుగుండూరు–ఇంకొల్లు రోడ్డుపై మట్టిగుంట గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. చినగంజాం మండలం నీలాయపాలేనికి చెందిన గుడివాడ అంజయ్య (62) ఉప్పుగుండూరు నుంచి ఇంకొల్లు వైపు బైక్‌పై వెళ్తున్న సమయంలో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంజయ్యను 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలిస్తుండగా, మార్గం మధ్యలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

ఘాట్ ఎక్కలేక ఆగిన లారీ

- రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో గంట పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు


రోళ్లపెంట మొదటి ఘాట్ రోడ్డులో నిలిచిన లోడు లారీ

పెద్దదోర్నాల: ఘాట్ రోడ్డు ఎక్కలేక ఓ లోడు లారీ రోడ్డుపై అడ్డంగా నిలిచిపోయింది. గంట పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. ఈ సంఘటన నంద్యాల, ప్రకాశం జిల్లాల సరిహద్దులోని రోళ్లపెంట వద్ద శనివారం చోటుచేసుకుంది. దీనివలన కర్నూలు–గుంటూరు రహదారిలో గంట పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సంఘటన స్థలానికి ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. కర్నూలు నుంచి దోర్నాల వైపునకు వెళ్తున్న ఏపీ39 టీయూ 6111 నంబర్ గల లోడు లారీ నల్లమల అటవీ ప్రాంతంలోని రోళ్లపెంటగూడెం సమీపంలో ఘాట్ రోడ్డు ఎక్కలేక రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. మధ్యాహ్నం ఒకటిన్నర గంటల సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. తొలుత లారీ సగభాగమే రోడ్డుకు అడ్డంగా ఉండటంతో కొంత మేర ఇబ్బందులు ఎదురైనా చిన్న చిన్న వాహనాలన్నీ ఎటువంటి అంతరాయం లేకుండా ప్రయాణించాయి. అనంతరం లోడు లారీ మరింత వెనక్కి రావడంతో రహదారి పూర్తిగా మూసుకుపోయి వాహనాల రాకపోకలకు పూర్తి స్థాయిలో అంతరాయం ఏర్పడింది.

దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో ఈ సంఘటన చోటుచేసుకోవడంతో విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. సమాచారం అందుకున్న నంద్యాల జిల్లా ఆత్మకూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వాహనాల డ్రైవర్ల సహకారంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాన్ని పక్కకు తొలగించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోయాయి. మహాశివరాత్రి సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో అధికారులు ఇప్పటి నుంచే భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాల్సి ఉందని భక్తులు కోరుతున్నారు.